సాక్షి
చిత్తూరు
మంగళవారం । 15 । జూలై । 2025



సమస్యలు పరిష్కరించండి సారూ..!

చిత్తూరు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు క్యూ కట్టారు. - 8లో



అంతర్రాష్ట్ర రైలు దొంగల అరెస్ట్

తిరుపతి జిల్లా రేణిగుంటలో ఇద్దరు అంతర్రాష్ట్ర రైలు దొంగలను అరెస్ట్ చేసినట్టు గుంతకల్లు ఎస్పీ తెలిపారు. - 8లో



ఆరు టిప్పర్లు సీజ్

పాలసముద్రం మండలం, వనదుర్గాపురం పంచాయతీ నుంచి అక్రమంగా తరలుతున్న గ్రావెల్ లారీలను అధికారులు సీజ్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

ఎరువుల దుకాణాలపై దాడులు



పెనుమూరులో అధికారుల తనిఖీలు

పెనుమూరు(కార్వేటినగరం): ఎరువుల దుకాణాలపై సోమవారం స్టేట్ విజిలెన్స్ స్క్వాడ్ దాడులు నిర్వహించింది. ఏడీఏ ధనుంజయ రెడ్డి, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రవి మాట్లాడుతూ డీలర్లందరూ ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలన్నారు. ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎరువుల దుకాణాలను పరిశీలించి నిల్వల వివరాలను, అమ్మకాలు జరిపిన బిల్లులను పరిశీలించారు. ఎరువుల ధరల డ్యాష్ బోర్డును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ దాడుల్లో చిత్తూరు డీఏఓ కార్యాలయం ఏవో శ్రీకాంత్‌రెడ్డి, పెనుమూరు వ్యవసాయ అధికారి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వెబ్‌ల్యాండ్ ప్రక్రియను పర్యవేక్షించాలి



మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో వెబ్‌ల్యాండ్ ప్రక్రియను ఆర్డీవోలు పర్యవేక్షించాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆమె చాంబర్‌లో రెవెన్యూ, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ వెబ్‌ల్యాండ్ ప్రక్రియలో తహసీల్దార్ల నుంచి ఒరిజినల్ ఫైళ్లను తెప్పించుకుని ఆర్డీవోలు పరిశీలించాలన్నారు. లబ్ధిదారులను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా స్లాట్లు ఇచ్చి దరఖాస్తులను స్వీకరించాలన్నారు. రీ సర్వే ప్రక్రియలో జిల్లాలో మొదటి దశలో 31 గ్రామాలలో చేపట్టినట్లు తెలిపారు. ఈ సర్వే పూర్తయిన గ్రామాల్లో ఆర్‌వోఆర్‌లను ఆర్డీవో లు వెంటనే ప్రచురించాలన్నారు. ఈ నెలాఖరు లోపు జిల్లాలోని వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటివద్దకే రేషన్‌ను పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇంటి పట్టాకు అందిన దరఖాస్తులను పరిశీలించి అర్హుల జాబితాను గుర్తించాలన్నారు. గ్రామ సభలు నిర్వహించి జాయింట్ ఎల్‌పీఎం దరఖాస్తులు స్వీకరించాలన్నారు. డీఆర్వో మోహన్‌కుమార్, కలెక్టరేట్ సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

ఫిర్యాదుల విషయంలో నిర్లక్ష్యం తగదు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

చిత్తూరు అర్బన్: ప్రజాఫిర్యాదుల విషయంలో నిర్లక్ష్యం వద్దన్ని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పోలీసు అధికారులకు ఆదేశించారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీతోపాటు అడిషనల్ ఎస్పీ రాజశేఖరరాజు, డీఎస్పీ సాయినాథ్ కలసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సైబర్‌క్రైమ్, వేధింపులు, కుటుంబ తగదాలు, నగదు లావాదేవీలకు సంబంధించి 42 ఫిర్యాదులు వచ్చాయి. వీటిని క్షుణంగా పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

గిన్నీస్ రికార్డుకు టీచర్లు బాధ్యులా?

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం పాలనలో మెగా పీటీఎం పేరుతో గిన్నీస్ బుక్ రికార్డు పొందేందుకు టీచర్లను బాధ్యులు చేయడం తగదని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డిశేఖర్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇటీవల జిల్లా వ్యాప్తంగా మెగా పీటీఎంను నిర్వహించిందన్నారు. ఇందులో సాంకేతిక లోసుగులు సరిచేయకుండా ఆ తప్పులను టీచర్ల పై వేసి బాధ్యులను చేయడం సరైన పద్ధతి కాదని మండిపడ్డారు. టీచర్ల వద్ద ఉన్న ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేసినప్పటికీ అవి సరిగా లేవంటూ తిరిగి అప్‌లోడ్ చేయాలంటూ ఒత్తిడి చేయడం కరెక్టు కాదన్నారు. అప్‌లోడ్ చేయకపోతే షోకాజ్ నోటీసులు జారీచేస్తామని టీచర్లను భయాందోళనకు గురిచేయడం అన్యాయమన్నారు. యాప్‌ల నిర్వహణలో ఏర్పడే సాంకేతిక సమస్యలకు ఎవరు బాధ్యత వహిస్తారో కూటమి ప్రభుత్వం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

నమ్మలేం బాబు!





ఎన్నికల ముందు అలవిగాని హామీలు

- అధికారంలోకి వచ్చాక పంగనామాలు
- నేతల సంతకాలతో ఇచ్చిన బాండ్ల సంగతేంటో?
- బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి ధ్వజం

'ఎన్నికల ముందు కూటమి నేతలు అలవిగాని హామీలిచ్చారు. సూపర్–6 పేరుతో కల్లబొల్లి కబుర్లు చెప్పారు. ఉచిత బస్సు అంటూ ఊదరగొట్టారు. ప్రతి ఇంటికీ రూ.5 వేలు అంటూ సంతకాలు పెట్టి మరీ బాండ్లు పంపిణీ చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక వాటన్నింటినీ అటకెక్కించారు. ఏడాది కాలంలోనే ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్నారు.. ఇలాంటి పరిస్థితుల్లో ఏ ఊర్లోకెళ్లినా ప్రజలు బాబును ఇక నమ్మే ప్రసక్తే లేదని అంటున్నారు..' అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో సోమవారం జరిగిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సభల్లో పాల్గొని ప్రసంగించారు.

సదుం: ఎన్నికల సమయంలో హామీలు గుప్పించి ..అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరిస్తున్న చంద్రబాబును ప్రజలు ఇక నమ్మే పరిస్థితి లేదని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని ఎర్రాతివారిపల్లెలో బాబు షూరిటీ–మోసం గారెంటీలో భాగంగా నిర్వహించిన మండల స్థాయి వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల సమయంలో బాబు ఇచ్చిన బాండ్ల హామీని బీజేపీ నాయకులు సైతం విశ్వసించ లేదన్నారు. ఎన్టీఆర్ నుంచి అధికారం లాక్కొని కరెంటు చార్జీలను పెంచడంతో పాటు, మద్యపాన నిషేధానికి తూట్లు పొడిచారని ధ్వజమెత్తారు. బెల్టుషాపులు విస్తృతం చేశారని మండిపడ్డారు. ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ఇచ్చిన హామీలను ఏనాడూ అమలు చేయలేదన్నారు. దీంతో ప్రజలకు చంద్రబాబుపై విశ్వాసం పోయిందన్నారు. ఎన్ని కష్టాలొచ్చినా సంక్షేమ పథకాలను అమలు చేసింది వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనన్నారు.

గ్రామకమిటీలే కీలకం

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు పెద్దిరెడ్డి తెలిపారు. ఇవి భవిష్యత్తులో కీలకంగా మారనున్నట్లు వెల్లడించారు. రానున్న ఎన్నికల్లోపు.. ఆ తర్వాత కూడా గ్రామ కమిటీలకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. గ్రామాల్లోని ముఖ్యనాయకులకు కమిటీలలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు.



పులిచెర్ల : నేతలతో కలిసి బాబుష్యూరిటీ–మోసం గ్యారంటీ బార్‌కోడ్లను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

మీకు రుణపడి ఉంటా

గత 47 ఏళ్ల తన రాజకీయ జీవితంలో అండగా ఉంటూ.. తన వెంట నడుస్తున్న మండల ప్రజానీకానికి రుణ పడి ఉంటానని మాజీ మంత్రి పెద్దిరెడ్డి చెప్పారు. ప్రతి ఎన్నికల్లోనూ తమ కుటుంబ సభ్యులకు మెజారిటీ అందిస్తున్న మండల ప్రజల రుణం తీర్చుకోలేనిదన్నారు. వారికి ఏకష్టం వచ్చినా తాము అండగా నిలుస్తామన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, అనీషారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, పోకల అశోక్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ మాధవి, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, పుత్రాజు, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రెడిఈశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాబురెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.



సదుం: క్యూఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నాయకులు



పులిచెర్ల : సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

గ్రామకమిటీలు ఏర్పాటు చేయాలి

ప్రతి పంచాయతీలోనూ గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలని పెద్దిరెడ్డి సూచించారు. రాబోవు ఎన్నికల్లో ఈ కమిటీలే కీలకమని తెలిపారు. ఈ కమిటీల ద్వారా గ్రామస్థాయిలో బార్‌కోడ్ ద్వారా స్కాన్ చేయించి బాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శులు అనూషారెడ్డి, పెద్దిరెడ్డి, మాజీ టీటీడీ బోర్డు సభ్యులు పోకల అశోక్‌కుమార్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, మండల కన్వీనర్‌నాదమునిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మున్వత్ బాషా, రెడ్డీశ్వరరెడ్డి, హేమసుందరరెడ్డి, వల్లివేడు రాజారెడ్డి, ఎస్ఎస్ రెడ్డి ప్రకాష్, పోకల చంద్ర, రెడ్డీ అహమ్మద్, మంజుల, మువ్వల నరశింహులుశెట్టి నిరంజన్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, గోవిందరెడ్డి, మునీర్‌ఖాన్ పాల్గొన్నారు.

బాబు మోసాలను ఎండగడుదాం

పులిచెర్ల(కల్లూరు): ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి ,పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. కల్లూరులోని సినిమా హాలులో మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో బాబు ష్యూరిటీ–మోసం గ్యారింటీ పై సమావేశం నిర్వహించారు. ముందుగా నాయకులతో కలిసి బాబు ష్యూరిటీ–మోసం గ్యారింటీ బార్‌కోడ్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం జిల్లాకే పరిమితం చేశారని, సూపర్–6పేరుతో అలవిగాని హామీలిచ్చి ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ప్రతిఇంటికీ అదిచేస్తాం–ఇదిచేస్తాం అని చెప్పిప్రచారం చేసి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సంతకాతో ఇచ్చిన బాండ్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. చేసిన మోసాలు ప్రజలు మరువరన్నారు. బాబు మోసాలను ప్రతి ఒక్కరూ ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలియజేయాలన్నారు.

భక్తిప్రపత్తులతో సంకటహర చతుర్థి

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానంలో సోమవారం సంకటహర చతుర్థి గణపతి వ్రతాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. చతుర్థి సందర్భంగా ఉదయం ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలకు సుగంధ పుష్పాలతో అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ అధికారులు ఉత్సవ మూర్తులను మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి ఆస్థాన మండపంలో కొలువుదీర్చారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు శాస్త్రోక్తంగా సంకటహర చతర్థి గణపతి వ్రతాన్ని చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈవో పెంచల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



బంగారు రథంలో ఊరేగుతున్న ఉత్సవమూర్తి

స్వర్ణరథంపై ఊరేగింపు

రాత్రి కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ మాడ వీధుల్లో స్వర్ణ రథంపై ఊరేగారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మెనూ తప్పనిసరి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట : నాణ్యత ప్రమాణాలు పాటించి విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మండలంలోని పత్రపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను, పిల్లలకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో ఏవైనా సమస్యలుంటే నేరుగా తనకు చెప్పాలని విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట ఎంపీటీసీ పత్రపల్లి చలపతి ఉన్నారు.

అక్రమ కేసులకు అదరం..బెదరం



చిత్తూరు జైలులో ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులను పరామర్శిస్తున్న సమన్వయకర్త కృపాలక్ష్మి

కార్వేటినగరం: అక్రమ కేసులు బనాయించి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను భయపెట్టాలని చూడడం వారి అవివేకమని, ఇలాంటి తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదని జీడీనెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మి స్పష్టం చేశారు. గత వారం రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జిల్లా పర్యటనలో ఫొటో గ్రాఫర్‌పై దాడి చేశారని ఆరోపిస్తూ అక్రమ కేసులు బనాయించి జిల్లా కారాగారంలో బంధించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు చక్రి, మోహన్, వినోద్‌ను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా కృపాలక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు. ఎన్ని కుయుక్తులు పన్నినా, ఎన్ని కేసులు పెట్టినా జనంలో జగనన్నపై ఉన్న అభిమానాన్ని చెరపలేరని స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్తకు జగనన్న, జగనన్న పార్టీ అండగా నిలిస్తోందని భరోసానిచ్చారు. ఆమె వెంట జీడీ నెల్లూరు మండల కన్వీనర్ వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, నాయకులు పెద్దిరెడ్డి, అలీషేర్‌ఖాన్, ఉదయ్, మోహన్, వినోద్ కుటుంబ సభ్యులు ఉన్నారు.

రోల్ మోడల్‌గా చిత్తూరు ఎస్‌పీఎం



ఎస్‌పీఎంను పరిశీలిస్తున్న సీఎండీ సంతోషరావు

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్రంలో రోల్ మోడల్‌గా చిత్తూరు ఎస్‌పీఎం (ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రం)ను తీర్చిదిద్దుతామని ట్రాన్స్‌కో సీఎండీ సంతోషరావు తెలిపారు. సోమవారం స్థానిక ఎస్‌పీఎంను పరిశీలించి మాట్లాడారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా చిత్తూరులో 2వేల లీటర్ల ఓఆర్‌ఎం (ఆయిల్ రీజనరేషన్ మిషన్) అందుబాటులో ఉందన్నారు. ఇక్కడి నుంచి శుద్ధి చేసిన ఆయిల్‌ను పలమనేరు, పుంగనూరు, కార్వేటినగరం ఎస్‌పీఎంలకు పంపవచ్చన్నారు. మిషన్ ఆపరేటింగ్‌కు టెక్నికల్ సహాయకులను నియమిస్తామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల పరంగా అన్ని మరమ్మతులు చిత్తూరు నుంచే జరిగే విధంగా చూస్తామన్నారు. ఈ విధానం విజయవంతమైతే ప్రతి జిల్లాలో ఒక ఓఆర్‌ఎంను కేటాయిస్తామన్నారు. పలు ప్రాంతాల్లో ఏఈలు మండల కేంద్రాల్లో నివాసం ఉండడం లేదన్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడితే ఎలా అని ప్రశ్నించారు. మండల కేంద్రాల్లో ఏఈలు తప్పనిసరిగా నివాసం ఉండాలన్నారు. అనంతరం స్టోర్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ కార్యాలయ మొదటి అంతస్తు నిర్మాణానికి ఫర్నిచర్ మంజూరు చేయాలని ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్ కోరారు. అనంతరం చిత్తూరు రూరల్ డివిజన్ కార్యాలయాన్ని పరిశీలించారు. డైరెక్టర్ గురవయ్య, సీజీఎం జానకీరామ్, ఈఈలు మునిచంద్ర, సురేష్, అమర్‌బాబు, డీఈలు ప్రసాద్, వసంతనాయుడు, ఏఈలు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎం బదిలీల్లో కూటమి పెత్తనం

ఏఎన్‌ఎం బదిలీల్లో కూటమి పెత్తనం జోరందుకుంది. ప్రజాప్రతినిధుల జోక్యంతో గందరగోళమైంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులపై ఒత్తిడి తెచ్చి 80 శాతం ముందస్తు బుకింగ్ చేసుకుంది. ఆపై పలువురు ప్రజాప్రతినిధుల అనుచరులు తెరపైకి తతుక్కమన్నారు. కోరుకున్న స్థానానికి బదిలీ అయ్యేందుకు రూ.30 వేల నుంచి రూ. లక్ష వరకు వసూలు చేశారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఈ దందాతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు జుట్టు పీక్కుంటున్నారు. కూటమి పెత్తనంపై ఏఎన్‌ఎం, వైద్య సంఘ నేతలు మండిపడుతున్నారు.

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు బెదిరింపులు
- 80 శాతం ముందస్తు బుకింగ్‌లు
- ఆపై కొందరు ప్రజాప్రతినిధుల పేరుతో అనుచరుల దందాలు
- కోరుకున్న స్థానానికి బదిలీ చేస్తామంటూ రూ.30వేల నుంచి రూ.లక్ష వరకు వసూళ్లు
- మండిపడుతున్న ఏఎన్‌ఎం, వైద్య సంఘ నేతలు

తిరుపతి సాక్షిటాస్క్‌ఫోర్స్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 746 మంది గ్రేడ్–3 ఏఎన్‌ఎంలున్నారు. వీరిని బదిలీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో 693 మందికి సాధారణ బదిలీలు చేయగా.. మిగిలిన వారిని మెడికల్ గ్రౌండ్స్ కింద చూపించారు. తొలుత మాన్యువల్ ప్రకారం బదిలీలు చేయాలని నిర్ణయించారు. కూటమి నాయకులు, పలువురు ప్రజాప్రతినిధుల జోక్యంతో ఈ ప్రక్రియకు ఆటంకం ఏర్పడింది.



వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం

సిఫార్సుల వెల్లువ

బదిలీల ప్రకటనతో ఏఎన్‌ఎంలు వారికి అనుకూలమైన ప్రాంతాలు వరించేలా ఎవరికి వారు పోటీలు పడ్డారు. కూటమి బడా నేతలు, ఎమ్మెల్యేల వద్దకు క్యూకట్టారు. వారి సిఫార్సు లేఖలను బదిలీలకు జత చేశారు. ఈ సిఫార్సులు జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు కుప్పలు తెప్పలుగా వచ్చాయి. పలువురు ఎమ్మెల్యేలతో పాటు కూటమిలోని చోటామోటా నాయకులు కూడా సొంత లెటర్లతో సిఫార్సులు పంపారు. ఎవరికి వారు సత్తా చాటుకోవాలని శాఖపై పట్టుబట్టారు. సిఫార్సులతో పాటు ఫోన్లు చేసి అధికారులను విసిగించారు. వారి హోదాను గుర్తు చేస్తూ.. భయభ్రాంతులకు గురిచేశారు. ఈకారణంగా ఎవరి సిఫార్సుకు తలొగ్గాలో తెలియక అధికారులు తలలు పట్టుకున్నారు. బదిలీల ప్రక్రియను కొన్ని రోజుల పాటు వాయిదా వేస్తూ వచ్చారు.

వైద్య ఆరోగ్య శాఖపై బురద

కూటమి నేతల జోక్యం, ఒత్తిడి, సిఫార్సులను అధిగమించేందుకు జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు శాఖ అధికారులు బదిలీల్లో జూమ్ కౌన్సెలింగ్‌ను తీసుకొచ్చారు. ఈనెల 8వ తేదీ నుంచి జూమ్ ద్వారా కౌన్సెలింగ్‌ను ప్రారంభించారు. 11వ తేదీ రాత్రితో ఈ ప్రక్రియను ముగించారు. అయితే చాలా మందికి ఆశించిన ప్రాంతాలు రాక అయోమయానికి గురవుతున్నారు. మరికొందర్ని దూర ప్రాంతాలకు బదిలీ చేశారు. బదిలీల ప్రక్రియ ముగిసిన ఇప్పటికీ సిఫార్సుల గోల తగ్గడం లేదు. అధికారులపై కొందరు ఏఎన్‌ఎంలు ప్రజాప్రతినిధులు, కూటమి నేతల ద్వారా ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో ఆర్డర్ పత్రాలు ఇచ్చేందుకు కూడా అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. ఈ కారణంగా శాఖపై బురద పడుతోంది. కార్యాలయంలో కొంతమంది సిబ్బంది ముడుపులు తీసుకుని ఇష్టానుసారంగా బదిలీలు చేయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇదంతా కూటమి నేతల జోక్యంతో వచ్చిన యవ్వారమని ఏఎన్‌ఎం, వైద్య సంఘ నేతలు మండిపడుతున్నారు.

సహాయకులతో వసూళ్లు?

కొందరు ఏఎన్‌ఎంలే వారి సహాయకులకు కాసులతో ఆశ చూపించారు. తాను అనుకున్న స్థానానికి బదిలీ చేయిస్తే అడిగింత ఇచ్చుకుంటానని ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో ఏఎన్‌ఎంల బదిలీలకు భారీగా డిమాండ్ ఏర్పడింది. దీన్ని అదునుగా చేసుకుని కొందరు రెచ్చిపోయారు. వారు ఒక్కో బదిలీకి రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేసినట్లు పలువురు ఏఎన్‌ఎంలు ఆరోపిస్తున్నారు.

ముందస్తు బుకింగ్‌లు

ఏఎన్‌ఎంల బదిలీల విషయంలో డిమాండ్ పెరిగే కొద్దీ పలువురు కూటమి నేతలు, ప్రజాప్రతినిధులు రంగంలోకి దిగారు. తమ ప్రాంతంలో తమకు తెలియకుండా బదిలీలు చేయకూడదని హుకుం జారీ చేశారు. తమకు అనుకూలమైన వారినే వేయించుకుంటామని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. ముందస్తుగానే 80శాతం ప్రాంతాలను వారి గుప్పెట్లోకి తీసుకున్నారు. అక్కడికి రావాల్సిన వారిని వారే ఎంపిక చేసి అధికారులకు జాబితా పంపారు. కాగా వారి ఒత్తిడికి అధికారులు తలొగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. లేకుంటే ఇక్కడి నుంచి శాఖలో పనిచేసే అధికారులను బదిలీ చేయిస్తామని బెదిరింపులకు దిగినట్లు తెలుస్తోంది. దీంతో వారు చేసేది లేక వారు చెప్పినట్లు బదిలీలను ముగించారు. కొందరు ప్రజాప్రతినిధులకు వ్యతిరేకంగా ఉన్న ఏఎన్‌ఎంలు, వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్న ఏఎన్‌ఎంపై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారు. వారిని సుదూర ప్రాంతాలకు బదిలీ చేయించాలని ప్రయత్నాలు చేశారు.

గందరగోళం ఏమీ లేదు



జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు కౌన్సెలింగ్ నిర్వహించాం. జూమ్ పద్ధతిలో ప్రక్రియను పూర్తిచేశాం. త్వరలో ఆర్డర్లు కూడా ఇచ్చేస్తున్నాం. మాకైతే ఎవరినీ ఇబ్బంది పెట్టించాల్సిన అవసరం లేదు. శాఖలో పనిచేసేవారు మా కుటుంబ సభ్యులే. వాళ్లను ఇబ్బంది పెట్టించాలని మేము ఏరోజూ కోరుకోం. ఇప్పటి వరకు వారికి ఇబ్బంది లేకుండా చూడాలని మా ప్రయత్నం చేస్తున్నాం. గందరగోళం ఏమీ లేదు. తప్పులుంటే కచ్చితంగా సరిదిద్దేలా చూస్తాం. సమస్యలుంటే నేరుగా తీసుకురావొచ్చు.

–సుధారాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, చిత్తూరు

క్లుప్తంగా

దొంగ అరెస్ట్



మాట్లాడుతున్న డీఎస్పీ పార్థసారథి

కుప్పం: అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు డీఎస్పీ పార్థసారథి తెలిపారు. తమిళనాడు రాష్ట్రం, తిరుపత్తూరు జిల్లా, కరంబూర్ గ్రామానికి చెందిన శక్తివేల్ దొంగతనాలకు పాల్పడేవాడని, ఈ క్రమంలో ఆంధ్రాలో అతనిపై ఇప్పటికే 14 కేసులు నమోదైనట్లు తెలిపారు. కుప్పం సర్కిల్ పరిధిలో కూడా అతనిపై నాలుగు కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. రెండు రోజుల క్రితం తమిళనాడు రాష్ట్రం పోలీసు నిఘా ఉంచి అతన్ని అరెస్టు చేసినట్లు తెలిపారు. నిదింతుడి వద్ద నుంచి 5 తులాల బంగారం, కేజీ వెండిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా రామకుప్పం మండలం, ననియాల గ్రామానికి చెందిన ఇద్దరు బియ్యం వ్యాపారులపై కేసు కూడా నమోదు చేసినట్లు తెలిపారు. ఇదిలా వుండగా గోవిందరాజులు, మాణిక్యం తమిళనాడు బియ్యాన్ని కొనుగోలు చేసి ఓ బియ్యం వ్యాపారికి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దళితులంటే అలుసా?



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : నగరి మండలం, గుండ్రాజ కుప్పం దళితవాడ ప్రజలను ఆదుకోవడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆ పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. గుండ్రాజ కుప్పం దళితవాడకు ఆనుకొని ఉన్న కొండను క్వారీ యజమానులకు అనుమతివ్వడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈ సమస్యను పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ జీడీ నెల్లూరు నియోజకవర్గం, పాలసముద్రం మండలం, సాయినగర్, ఎస్ఆర్ఆర్ కండ్రిగ, వనదుర్గపురం తదితర గ్రామాల్లో కొండలను తొలిచి టిప్పర్ల ద్వారా ఎర్రమట్టిని తోడేస్తున్నారని, అక్రమంగా తమిళనాడుకు తరలించి సొమ్ము చేస్తుకుంటున్నారని చెప్పారు.

సమస్యలు పరిష్కరించండి సారూ..!

- కలెక్టరేట్‌కు క్యూ కట్టిన అర్జీదారులు
- వినతులు స్వీకరించిన కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ, జేసీ విద్యాధరి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఎన్ఎంలు



తలపై బిందెలు పెట్టుకుని ధర్నా చేస్తున్న కృష్ణజమ్మాపురం గ్రామస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అర్జీదారులు సోమవారం కలెక్టరేట్‌కు క్యూ కట్టారు. «సమస్యలు పరిష్కరించండి సారూ..!» అంటూ అధికారులను అభ్యర్థించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు అందిస్తున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్ తదితరులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 299 అర్జీలు వచ్చినట్టు అధికారులు పేర్కొన్నారు.

దూరంగా బదిలీ చేశారు

జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారులు తమను ఇష్టానుసారంగా దూరంగా బదిలీ చేశారని ఏఎన్ఎంలు లక్ష్మి, చైతన్య, లీలా, సావిత్రి తదితరులు ఆరోపించారు. ఈ మేరకు ఇటీవల నిర్వహించిన బదిలీల్లో తమకు జరిగిన అన్యాయం పై కలెక్టర్ వద్దకు వెళ్లి న్యాయం చేయాలంటూ మొరపెట్టుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఏఎన్ఎంల బదిలీ నిర్వహించారన్నారు. 200 మందికి కౌన్సెలింగ్ నిర్వహించగా.. ముందు తప్పుల తడకగా సీనియారిటీ జాబితాను ప్రచురించారన్నారు. ఖాళీల జాబితాను ప్రచురించకుండా బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించినట్టు పేర్కొన్నారు. 5 ఆప్షన్లు పెట్టుకున్నప్పటికీ అందులో ఒక్కటీ రాలేదన్నారు. విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలలుగా నీటి సమస్య

గత ఆరు నెలలుగా నీటి సమస్య ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులెవ్వరూ పట్టించుకోవడం లేదని పాలసముద్రం మండలం, కృష్ణజిమ్మాపురం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ ఎదుట తలపై బిందెలు పెట్టుకుని ధర్నా నిర్వహించారు. ఆరు నెలలుగా నీటి కోసం అనేక కష్టాలు ఎదుర్కొంటున్నట్టు వెల్లడించారు. నీటి సమస్య పరిష్కరించాలని అధికారులను మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో గ్రామస్తులు వెంకటమ్మ, రమణమ్మ, శాలిని, సుమలత పాల్గొన్నారు.

భూములు ఎన్ని సార్లు ఇవ్వాలి



న్యాయం చేయాలని కోరుతున్న నగరి మండలం, వీకేఆర్ పురం గ్రామస్తులు

ఇప్పటికే ఎన్‌హెచ్ 716 రోడ్డు ఏర్పాటుకు రెండు సార్లు తమ భూములను ఇచ్చామని, మరలా ఇంకెన్ని సార్లు భూములు ఇవ్వాలని నగరి మండలం, వీకేఆర్ పురం, తడుకుపేట గ్రామస్తులు రవిచంద్రన్, జ్యోతిప్రకాష్ వాపోయారు. ఈ మేరకు గ్రామస్తులు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే రెండు సార్లు ఎన్‌హెచ్ 716 రోడ్డుకు భూములను తీసుకున్నారన్నారు. ప్రస్తుతం తిరిగి టోల్‌గేట్, స్లిప్ రోడ్డు ఏర్పాటు చేస్తామంటూ భూములు సేకరించేందుకు సన్నాహాలు చేస్తున్నారని ఆరోపించారు. తడుకుపేట వద్ద ఉన్న ప్రభుత్వ భూములలో టోల్‌గేట్, స్లిప్ రోడ్డు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

దారి సమస్య పరిష్కరించాలి



దారి సమస్య పరిష్కరించాలని కోరుతున్న తవణంపల్లి మండలం, నల్లప్పరెడ్డిపల్లి వాసులు

తమ పొలాలకు దారి సమస్య ఉందని, దీన్ని వెంటనే పరిష్కరించాలని తవణంపల్లి మండలం, నల్లప్పరెడ్డిపల్లి గ్రామస్తులు రామచంద్ర, శిల్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామస్తులు పీజీఆర్ఎస్‌లో అర్జీ అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. తాము వ్యవసాయ కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నామని, తమ పొలాలకు తరతరాలుగా ప్రభుత్వ భూమిలో ఉండే నీటి కాల్వ దారిలో వెళ్తున్నామన్నారు. ఆ దారిని కొందరు అడ్డుకుని ఇబ్బందులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

చిత్తూరు ఎంపీ ఇంతవరకు రాలేదు

- కలెక్టరేట్ ఎదుట టీడీపీ నగరి నియోజకవర్గ నేతల ధర్నా



చిత్తూరులో ధర్నా నిర్వహిస్తున్న నగరి నియోజకవర్గ టీడీపీ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు ఎన్నికైనప్పటి నుంచి ఇంత వరకు నగరి వైపు రాలేదని ఆ నియోజకవర్గ టీడీపీ నేత చలపతి ఆరోపించారు. ఈ మేరకు ఆ పార్టీ నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులు చేతబట్టి ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు ఎంపీని చిత్తూరు పార్లమెంట్ పరిధిలోని నగరికి రానివ్వకుండా కొన్ని దుష్టశక్తులు అడ్డుపడుతున్నాయని ఆరోపించారు. గతంలో సైతం దివంగత ఎంపీ శివప్రసాద్ పట్ల ఇలాంటి ధోరణే అమలు చేశారని ఆరోపించారు. చిత్తూరు ఎంపీ నగరికి విచ్చేసి అభివృద్ధికి తోడ్పాటునివ్వాలన్నారు. అనంతరం నగరి తెలుగుదేశం పార్టీలో దెయ్యం ఎవరు భూతం ఎవరంటూ ప్లకార్డులు చేతబట్టి ధర్నా నిర్వహించారు. తర్వాత కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

200 మీటర్ల కేబుల్ వైరు చోరీ

చౌడేపల్లె: మండలంలోని చారాల కురప్పల్లెకి తాగునీటి సరఫరాచేసే బోరుకు అమర్చిన 200 మీటర్ల కేబుల్ వైరు ఆదివారం రాత్రి చోరీకి గురైందని సర్పంచ్ విజయకుమారి తెలిపారు. వైరు విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని, ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పేర్కొన్నారు.

అవినీతి పీడీపై వేటు!

- హౌసింగ్ పీడీ గోపాల్ నాయక్ సస్పెన్షన్
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



సస్పెన్షన్‌కు గురైన జిల్లా హౌసింగ్ పీడీ గోపాల్ నాయక్

చిత్తూరు కలెక్టరేట్ : అవినీతి పీడీపై వేటు పడింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వివరాలు.. హౌసింగ్ పీడీగా గోపాల్ నాయక్‌కు సీఎం సొంత జిల్లాలో పోస్టింగ్ కల్పించారు. ఈయన పై గతంలో అనేక ఆరోపణలు ఉన్నప్పటికీ కీలకమైన శాఖను అప్పగించారు. ఆయన రోజూ తిరుపతి జిల్లా కేంద్రం నుంచి రాకపోకలు సాగించేవారు. స్థానికంగా ఉండకపోవడంతో హౌసింగ్ అడ్మినిస్ట్రేషన్‌ను గాలికొదిలేశారు. గత సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఆలస్యంగా వచ్చిన ఆయనపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. ప్రస్తుతం ఆయన గతంలో చేసిన అవినీతి ఆరోపణలను విచారించిన తర్వాత సస్పెండ్ వేటు వేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

సస్పెండ్ ఇందుకేనా?

భూక్య గోపాల్ నాయక్ గతంలో అన్నమయ్య జిల్లా పీలేరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తూ రాయచోటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించేవారు. ఆ సమయంలో అనగాని శ్రీహరి అనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి నుంచి బదిలీకి సంబంధించి లంచం డిమాండ్ చేశారు. ఈ విషయం బాధితుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాడు. విచారించిన ప్రభుత్వం ప్రస్తుతం అతనిపై సస్పెన్షన్ వేటు వేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ ఉత్తర్వులు జారీచేశారు.

అది ఆయనకు అలవాటే!

హౌసింగ్ పీడీ గోపాల్ నాయక్ సస్పెండ్ విషయం జిల్లా అధికారుల్లో చర్చనీయాంశంగా మారింది. ఆయన గతంలో పీలేరు డీఈఈగా పనిచేస్తున్న సమయంలో హౌసింగ్ లే అవుట్‌లలో జంగిల్ క్లియరెన్స్ కు ఓటీఎస్ నగదు ఖర్చు చేయకుండా నిబంధనలకు వ్యతిరేకంగా డ్రా చేసి పక్కదారి పట్టించారనే ఆరోపణలున్నాయి. అదేవిధంగా రాయచోటిలో ఇళ్ల నిర్మాణాలకు ఉపయోగించే ఇసుకను భారీ స్థాయిలో పక్కదారి పట్టించారని సమాచారం. పీలేరులో డీఈఈగా పనిచేస్తున్న సమయంలో ఇసుక, సిమెంట్, స్టీల్ ను భారీగా అక్రమదారుల్లో అమ్మకాలు చేశారనే ఆరోపణలున్నాయి.

మేకలు తెచ్చిన గొడవ

- యువకుడిపై కత్తితో దాడి



దాడిలో తీవ్రంగా గాయపడిన రామ్‌విలాస్‌పాస్వాన్

బంగారుపాళెం: మేకలు పొలంలో మేయడంతో ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదానికి దారితీసింది. ఈ క్రమంలో మేకల యజమాని పొలం యజమానిపై కత్తితో విక్షణారహితంగా దాడి చేశాడు. ఈ ఘటన సోమవారం మండలంలోని తుంబకుప్పం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అహ్మద్‌బాషాకు కొని మేకలు ఉన్నాయి. ఆదివారం మేకలు మేపుకునేందుకు గ్రామ సమీపంలోకి వెళ్లాడు. మేకలు దళితవాడకు చెందిన రామ్‌విలాస్‌పాస్వాన్ పొలంలో పైరును మేశాయి. దాంతో పొలం యజమాని మేకల్లో ఒకదాన్ని పట్టుకుని ఇంటికి తీసుకెళ్లాడు. ఈ విషయంగా రాత్రి అహ్మద్‌బాషా మేకను ఎందుకు పట్టుకుని పోయావని అడగడంతో రామ్‌విలాస్‌పాస్వాన్, అతని తండ్రి బాబుఅహ్మద్‌బాషా పై దాడి చేశాడు. గ్రామస్తులు చొరవ తీసుకుని సర్దుబాటు చేసి పంపారు. సోమవారం ఇదే విషయమై అహ్మద్ బాషా, రామ్‌విలాస్‌పాస్వాన్ మధ్య గొడవ చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో అహ్మద్‌బాషా తన వద్ద ఉన్న కత్తితో రామ్‌విలాస్‌పాస్వాన్ (30)పై దాడి చేసి ఎడమ చేయి, కుడికాలుపై తీవ్రంగా గాయపరచి అక్కడి నుంచి పారిపోయాడు. గాయపడిన యువకుడిని స్థానికులు 108 ద్వారా బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చీలాపల్లె సీఎంసీకి రెఫర్ చేశారు. బాధితుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రంగస్థల కళాకారుడి ఆత్మహత్య

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నాటక కళాకారుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమ వారం చిత్తూరు మండలంలోని అరతల ప్రాంతంలో చోటుచేసుకుంది. బీఎస్ఆర్‌పేట పోలీసుల వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం సోలింగరం పరిధిలోని నరికుల్లమేటు గ్రామానికి చెందిన జయకరన్ (26) నాటకాలు వేస్తూ బతుకు జీవనం సాగిస్తున్నాడు. చిత్తూరు మండలంలోని అరతలోని ద్రౌపదమ్మ ఆలయంలో మహాభారత యజ్ఞ మహోత్సవం ప్రారంభమైంది. ఇందులో భాగంగా తమిళనాడుకు చెందిన తమిళ నాటక కళాకారులను నిర్వాహకులు రప్పించారు. ఈ కళాకారుల్లో జయకరన్ బఫ్ఫూన్ (కమెడియన్) వేషధారణతో ప్రజలను నవ్వించాడు. రెండు రోజుల క్రితం అతడు ఊరెళ్లి వచ్చాడు. ఆదివారం రాత్రి బఫ్ఫూన్ వేషంతో మెప్పించి మధ్యాహ్నం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలయానికి సమీపంలో ఉన్న ఓ మామిడితోటలో చెట్టుకు లుంగీతో ఉరివేసుకుని మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతిడికి పెళ్లై పిల్లలున్నారని పోలీసులు తెలిపారు.

మతిస్థిమితం లేని మహిళపై లైంగిక దాడి

- ఇంకా నమోదు కాని కేసు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మతిస్థిమితం లేని ఓ మహిళపై లైంగిక దాడి చేసిన ఘటన సోమవారం చిత్తూరు నగరం మాపాక్షి ప్రాంతంలో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం.. మాపాక్షికి చెందిన 39 ఏళ్ల మతిస్థిమితం లేని మహిళపై అదే గ్రామానికి చెందిన 50 ఏళ్ల వ్యక్తి లైంగిక దాడికి పాల్పడుతూ వచ్చాడు. దీనిపై అనుమానం కలిగిన బాధిత సోదరుడు ఇంట్లో మొబైల్‌లోని కెమెరా ఆన్‌చేసి ఉంచాడు. ఆపై సాయంత్రం ఇంటికొచ్చి మొబైల్‌లో నమోదైన వీడియోను పరిశీలించాడు. అసలు విషయం బట్టబయలైంది. బాధిత కుటుంబీకులు ఆ వీడి యోను తాలూకా పోలీసులకు తీసుకెళ్లి చూపించారు. ఇంకా కేసు నమోదు కాలేదు

టీబీని నివారిద్దాం



తనిఖీలో కేంద్ర బృందం అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): 2025 ఆఖరి కల్లా టీబీని దేశం నుంచి తరిమికొట్టాలని సెంట్రల్ టీబీ డివిజన్ డిప్యూటీ కమిషనర్ భవానిసింగ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం జిల్లాలో జరుగుతున్న టీబీ ముక్త భారత్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. టీబీని సమూలంగా నిర్మూలించాలనే సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం టీబీ ముక్త భారత్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. 60 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికీ షుగర్, తాగుడు అలవాటు ఉన్నవారికి, పాత టీబీ రోగులకు, హెచ్ఐవీ రోగులందరికీ టీబీ స్క్రీనింగ్ పరీక్షలు తప్పనిసరిగా చేయించాలన్నారు. అనంతరం జిల్లా టీబీ నివారణ అధికారి వెంకటప్రసాద్ మాట్లాడారు. ప్రతి సచివాలయ పరిధిలో రోజూ 10 మందికి టీబీ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించామన్నారు. అంతకుముందు జిల్లా టీబీ కార్యాలయాన్ని పరిశీలించిన అనంతరం పూతలపట్టులోని వేపనపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం జీడీ నెల్లూరు మండలంలోని నెల్లేపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. ఆయన వెంటన కేంద్ర బృందం సభ్యులు దర్మారావు, గంగాధర్, శ్రీ ధీరజ్, టీబీ శాఖ అధికారులు మనోహర్‌రెడ్డి, జశ్వంత్, సంతోష్ పాల్గొన్నారు.

ఆరు టిప్పర్ల సీజ్



టిప్పర్లను అడ్డుకుంటున్న తహసీల్దార్ అరుణకుమార్, ఎస్ఐ

పాలసముద్రం: గుట్టలోని గ్రావెల్ ఎర్రమట్టిని అక్రమంగా తమిళనాడుకి తీసుకెళ్తున్న ఆరు టిప్పర్లను స్థానిక తహసీల్దార్ అరుణకుమారి, ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తమ సిబ్బంది కలిసి దాడులు నిర్వహించి సీజ్ చేశారు. వారు మాట్లాడుతూ మండలంలోని తమిళనాడు సరిహద్దు గ్రామమైన వనదుర్గాపురం పంచాయతీలోని గుట్టలో అనుమతి లేకుండా అక్రమంగా గ్రావెల్ మట్టిని తీసుకెళ్తున్నట్టు ఫిర్యాదు అందిందన్నారు. పరిశీలించగా.. అక్కడ గ్రావెల్ ఎర్రమట్టిని టిప్పర్‌లో తమిళనాడుకు తీసుకెళ్తున్నట్టు గుర్తించామన్నారు. అనంతరం ఎర్రమట్టి తరలిస్తున్న ఆరు టిప్పర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్టు పేర్కొన్నారు. ఈ దాడుల్లో డెప్యూటీ తహసీల్దార్ రిశివర్మ, ఆర్ఐ దేవి, వీఆర్ఓ వెంకటాచలం పాల్గొన్నారు.

సబ్సిడీ దుర్వినియోగం కాకుండా చర్యలు



సమీక్షలో కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : తోతాపురి మామిడికి ప్రభుత్వం అందజేసే సబ్సిడీ దుర్వినియోగం కాకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తోతాపురి మామిడి రైతులకు రూ.4ను ప్రభుత్వం సబ్సిడీ కింద అందజేస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు మూడు లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురిని పరిశ్రమల నిర్వాహకులు కొనుగోలు చేశారన్నారు. జిల్లాలో ఇప్పటివరకు సేకరించిన మామిడికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.4 సబ్సిడీ మొత్తం రూ.120 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేసినట్టు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 30,500 మెట్రిక్ టన్నుల వేరుశనగ విత్తనాలు వచ్చినట్టు తెలిపారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర రైలు దొంగల అరెస్ట్

- కత్తులు, వైర్‌కట్టర్లు స్వాధీనం



నిందితుల అరెస్టు చూపుతున్న రైల్వే ఎస్పీ రాహుల్‌మీనా, డీఎస్పీ హర్షిత

చిత్తూరు కార్పొరేషన్: రైళ్లలో గత రెండు నెలలుగా దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను రైల్వే గుంతకల్లు ఎస్పీ రాహుల్‌మీనా, తిరుపతి డీఎస్పీ హర్షిత ఆధ్వర్యంలో రేణిగుంటలో చాకచక్యంగా పట్టుకున్నారు. సోమవారం పోలీసు అతిథిగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రలోని పుణె జిల్లా, ఖడ్కి గ్రామానికి చెందిన జలిందర్ మహిర్యా పవార్(50), కోహినూర్ నవనత్ పవార్(24) రైళ్లలో దొంగతనాలకు పాల్పడేవారని తెలిపారు. అనంతరం వారి నుంచి రెండు కత్తులు, రెండు వైర్‌కట్టర్లను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ ముఠా సభ్యులు ఎక్కువగా వేకువజామున 2–4 గంటల మధ్యలో నిర్మానుష ప్రాంతాల్లో సిగ్నల్‌బాక్స్‌లోని వైర్లను కట్ చేసి రైలు ఆగిపోయేలా చేసేవారని, ఆ తర్వాత కోచ్‌లో కిటికీ పక్కన ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకొని బంగారు చైన్స్, విలువైన వస్తువులు దోచుకునేవారన్నారు. కొన్ని సందర్భాల్లో కత్తులతో ప్రయాణికులను బెదిరించారని చెప్పారు.

వరుస దొంగతనాలు

గత నెల 26న సిద్దంపల్లె రైల్వే స్టేషన్ సమీపంలో చామరాజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణిస్తుండగా సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి రైలును ఆపారన్నారు. నలుగురు మహిళలను కత్తులతో బెదిరించి 85 గ్రాముల బంగారు గొలుసులు లాక్కున్నారని తెలిపారు. వీటిపై డీఎస్పీ హర్షిత ఆధ్వర్యంలో సీఐలు యత్రీంద, సుధాకర్‌రెడ్డి, ఎస్ఐలు ప్రవీణ్, రవి, ధర్మేంద్రరాజు, గోపాల్ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలను నియమించి వీరి కోసం మహారాష్ట్రలోని సోలాపూర్, పూణేలోని ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేసినట్టు తెలిపారు. అక్కడ దొరికిన సమాచారం మేరకు జూలై 13న నిందితులను రేణిగుంటలో అరెస్టు చేసినట్టు వెల్లడించారు. మే 2న మామండూరు రైల్వేస్టేషన్ సమీపంలో సోలాపూర్ స్పెషల్‌రైలులో ప్రయాణిస్తున్న వ్యక్తి నుంచి 35 గ్రాములు దోచుకోగా.., అదేనెల 12న పూతలపట్టు వద్ద ఆగి ఉన్న రైలు చివరిబోగిలో ఉన్న వ్యక్తి నుంచి దొంగతనానికి యత్నించి తప్పించుకున్నట్టు వెల్లడించారు. 14న ముంగిలిపట్టు రైల్వేస్టేషన్‌లో తిరుపతి–విల్లుపురం రైలులో ప్రయాణిస్తున్న మహిళ వద్ద 24 గ్రాముల బంగారు గొలుసు దొంగిలించగా.., 21న మంత్రాలయం రైల్వేస్టేషన్‌లో దొంగతనానికి యత్నించి విఫలమైనట్టు తెలిపారు. జూన్ 2న ముంగిలిపట్టు స్టేషన్‌లో చామరాజనగర్ ఎక్స్‌ప్రెస్‌లో ఇద్దరు మహిళల నుంచి 60 గ్రాములు దోచుకున్నట్టు పేర్కొన్నారు. జూన్ 5న మానవపాడు, 13న అల్లంపూర్ రైల్వేస్టేషన్లలో దొంగతనానికి యత్నించి విఫలమైనట్టు తెలిపారు. 24న తాడిపత్రి రైల్వేస్టేషన్‌లో కిటికీ పక్కన ఉన్న ప్రయాణికురాల నుంచి 27 గ్రాములు దోచుకున్నట్టు వెల్లడించారు.

రికవరీ శూన్యం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో గత రెండు నెలలుగా ఈ ముఠా 9 దొంగతనాలకు పాల్పడింది. ఇందులో మొత్తం 242 గ్రాముల బంగారాన్ని దోచుకున్నారు. వీరిని పట్టుకోవడానికి 40 మందితో కూడిన రెండు ప్రత్యేక బృందాలుగా ఏర్పడ్డాయి. మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. అక్కడ లభించిన సమాచారం మేరకు రేణిగుంటలో వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు కత్తులు, రెండు వైర్‌కట్టర్లు స్వాధీనం చేసుకున్నారు. కానీ ఒక్క గ్రాము బంగారం కూడా వారి వద్ద రాబట్టలేకపోయారు. కేసు దర్యాప్తునకు సహకరించిన చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రత్యేక బృందం సభ్యులకు అభినందన పత్రాలు అందజేశారు.

లైంగిక దాడి ఘటనపై కేసు

సాక్షి ఎఫెక్ట్..

చౌడేపల్లె: మహిళపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. 'సాక్షి'లో లైంగిక దాడికి యత్నం శీర్షికన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ కథనం ప్రచురితమైనది. ఈ ఘటనపై ఎస్పీ ఆరా తీశారు. ఆయన ఆదేశాల మేరకు పోలీసులు మండలంలోని కాగతి పంచాయతీ పలగార్లపల్లెకు చెందిన శ్రీనివాసులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.